సాక్షి పెద్దపల్లి

సోమవారం : 5 : జూన్ : 2023



రాజన్న సన్నిధిలో రద్దీ

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



కాలుష్యంలో పారిశ్రామిక ప్రాంతం

పర్యావరణం ప్రమాదపుటంచుల్లో ఉంది. ప్రకృతి సంపదైన నేల, నీరు, గాలి కలుషితమవుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది.

8లో▸

గరిష్టం/కనిష్టం

40.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



మల్లన్న సన్నిధిలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓడెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లా, మహారాష్ట్ర నుంచి వచ్చి పూజలు చేశారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి పర్యవేక్షించారు. స్వామివారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలకవర్గం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. ఆయన వెంట జెడ్పీటీసీలు గంటా రాములు యాదవ్, బొద్దుల లక్ష్మణ్ ఉన్నారు.

మోదీతోనే సమర్థ పాలన



మాట్లాడుతున్న అరవింద్‌మీనన్

పెద్దపల్లిరూరల్: ప్రధాని నరేంద్ర మోదీతోనే సమర్థవంతమైన పాలన అందుతోందని, ఆయన అమలు చేస్తున్న సంస్కరణలు ఫలితాలు ఇస్తున్నాయని బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్‌మీనన్ అన్నారు. మోదీ పాలనలో అమలైన పథకాలను ఆదివారం జిల్లాకేంద్రంలో పవర్‌ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పల్లెల అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. మోదీ విధానాలను గమనిస్తున్న ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను బూత్‌స్థాయి నుంచి వివరించేందుకు మహాజన్‌సంపర్క్ అభియాన్ చేపట్టామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. 2014 ముందు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయని కుంభకోణం అంటూ లేదని విమర్శించారు. యూపీఏ అంటే ఉల్టాపల్టా అలయెన్స్ అని అభివర్ణించారు. ప్రపంచ వేదికలపై రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను పాతరేయాలన్నారు. అనంతరం ఒడిశాలో రైలు ప్రమాదంలో మృతులకు నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఇన్‌చార్జి రాంనాథ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జి.సురేశ్‌రెడ్డి, దిలీప్, రాజేశ్వర్‌రావు, సంతోష్, మహంత, శ్రీకాంత్, సంపత్‌రావు, మధు, రాజేందర్ తదితరులున్నారు.

కేంద్రం తీరుతో సింగరేణి ఉనికి ప్రశ్నార్థకం



కార్మికులను కలుసుకుంటున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: కేంద్రం తీరుతో సింగరేణి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ఓసీపీ-3 కృషిభవన్‌లో ఆదివారం గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కార్మికులను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని తెలిపారు. కేంద్రం సింగరేణి జోలికొస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మెడికల్ కళాశాల ప్రారంభమైందని, ఇందులో కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా, చికిత్స కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేసేలా చూస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు కెంగర్ల మల్లయ్య, ఐలి శ్రీనివాస్, శంకర్‌నాయక్, మాదాసు రాంమూర్తి, చల్ల రవీందర్‌రెడ్డి, ఇనుముల సత్యం, దశరథం, దేవ వెంకటేశం పాల్గొన్నారు.

బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 13వ డివిజన్‌లో దశాబ్ది ప్రగతియాత్ర నిర్వహించారు. మహిళలు, వార్డు ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. డివిజన్లలో సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు రాకం లత తదితరులు పాల్గొన్నారు.

మెడి‘కిల్’ దందా



ఈచిత్రంలో కనిపిస్తున్నవి వేరువేరు ల్యాబ్‌లలో రక్త పరీక్ష చేసుకున్న ఒకే పేషెంట్‌కి సంబంధించిన రిపోర్ట్స్. పెద్దపల్లి మండలం కాపులపల్లికి చెందిన ఓ యువకుడు ఒంట్లో బాగాలేక జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. అతడికి బ్లడ్ టెస్టు చేసిన సిబ్బంది ప్లేట్‌లెట్స్ 23వేలకు పడిపోయాయని, ప్లేట్లెట్స్ ఎక్కించాల్సి ఉంటుందని రిపోర్ట్ ఇచ్చారు. అనుమానం వచ్చిన సదరు యువకుడు పక్కనే ఉన్న మరో ల్యాబ్‌లో టెస్టు చేయించుకున్నాడు. అందులో 1.23 లక్షల ప్లేట్లెట్స్ ఉన్నట్లు తేలింది. దీంతో సదరు యువకుడు, బంధువులు పైసల కోసం ల్యాబ్ నిర్వాహకులు ఇలా చేశారని గొడవకు దిగారు.

ఈనెల 26న పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన ఓ యువతి ఆరోగ్యం బాగాలేదని స్థానిక ఆర్ఎంపీని సంప్రదించింది. సదరు ఆర్ఎంపీ తెలిసీతెలియని పరిజ్ఞానంతో సదరు యువతికి ఇంజిక్షన్ ఇచ్చాడు. అది కాస్త వికటించి.. యువతి మృత్యువాత పడింది.



- వైద్య పరీక్షల పేరుతో ప్రైవేట్ ల్యాబ్‌ల్లో దోపిడీ
- పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కనిపించని ప్రమాణాలు
- జిల్లాలో గ్రామీణ వైద్యుల ఇష్టారాజ్యం
- అవగాహన, అర్హత లేకున్నా చికిత్స
- అడ్డుకట్టు వేయడంలో వైద్యశాఖ వైఫల్యం

చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేని ఆసుపత్రులు, ల్యాబ్‌లను సీజ్ చేస్తాం. జిల్లా కేంద్రంలో ఒకే రోగికి వేరు వేరు రిపోర్టులు వచ్చిన విషయం మా దృష్టికి రాలేదు. ఫిర్యాదు చేస్తే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. అలాగే ఆర్ఎంపీలు కేవలం ప్రథమచికిత్స మాత్రమే చేయాలి. అర్హతకు మించి వైద్యం చేయవద్దు.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, ఆర్ఎంపీలు అందినంతా దోచుకుంటున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అవసరం లేకున్నా పరీక్షల పేరుతో టెస్టులు చేయిస్తూ దండుకుంటుంటే.. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్ఎంపీలు ఆపరేషన్లు మినహా అన్ని రోగాలకూ చికిత్స చేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి శాంపిల్ మందులను రోగులకు అంటగడుతున్నారు. ఎక్కువ మోతాదులో సూదిమందులు ఇస్తూ ప్రాణాల మీదకి తెస్తున్నారు. ప్రాథమిక చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు, జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో అర్హతకు మించి చికిత్స చేస్తున్నారు.

టెస్టుల పేరుతో దోపిడీ

జిల్లాలో రక్త, మూత్ర, ఇతర వైద్య పరీక్షల కేంద్రాలు రోజురోజుకూ పుట్టుకొస్తున్నాయి. కనీస అర్హత లేని వారు డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. కనీస అర్హతలేని వారు రోగ నిర్ధారణ కేంద్రాలు నిర్వహిస్త మొక్కుబడిగా పరీక్షలు చేసి తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి వైద్య పరీక్షకు అయ్యే ఖర్చులకు సంబంధించి ధరల పట్టికను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. 90శాతం కేంద్రాల్లో అవేమీ కనిపించటం లేదు. రోగులకు లేనిరోగాలు అంటగడుతూ నిబంధనలు పాటించకుండా కనీసం అనుమతులు, నాణ్యతా ప్రమాణాల మాటే లేకుండా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ దందా సాగిస్తున్నారు. జిల్లాలో 106 ప్రైవేట్ ఆసుపత్రులుండగా, 09 ల్యాబ్‌లు అనుమతులున్నాయి. ఆసుపత్రికి అనుమతులు తీసుకుని, ల్యాబ్‌లకు తీసుకోకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిలో కనీస ప్రమాణాలు లేక, అడిగేవారు లేక ఒక కేంద్రానికి మరొక కేంద్రానికి మధ్య వైద్యపరీక్షల్లో భారీ వ్యత్యాసాలు వెల్లడవుతున్నాయి. దీని తాలూకు సైడ్ ఎఫెక్ట్‌లు మాత్రం ఆయా ఆసుపత్రులకు వచ్చే ప్రజలు ఎదుర్కొంటున్నారు.

ఆర్ఎంపీల వైద్యం

జిల్లాలో ఆర్ఎంపీలు వందల సంఖ్యలో ఉన్నారు. వీరిలో సగంమందికి ఎలాంటి అనుమతులూ లేకుండానే క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఇంజక్షన్ వేయరాదు. ఎవరైనా జ్వరంతో వస్తే సాధారణ మాత్రలే ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీప పీహెచ్‌సీకి సిఫారసు చేయాలి. కానీ వీరు ప్రతి సమస్యకూ ఇంజెక్షన్ ఇవ్వటం, ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి సూచిస్తున్నారు. వీటివల్ల రోగనిరోధక శక్తి తగ్గి దీర్ఘకాలంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి కమీషన్ తీసుకుంటున్న ఆర్ఎంపీలు రోగులను అక్కడికి సిఫారుసు చేసేలా అవగాహన కుదుర్చుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గర్భిణులకు పుట్టేది ఆడ, మగ పిల్లలో తెలియజేసేలా స్కానింగ్‌లు చేయించటం, అబార్షన్లు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన



ట్యాంక్‌పై ఉన్నవారితో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- బామ్లానాయక్‌తండా పాలకవర్గం ఆందోళన
- ఎస్ఈ హామీతో కిందికి దిగిన వైనం



వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయితీ పాలకవర్గం సభ్యులు

పాలకుర్తి: తమ గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బామ్లానాయక్‌తండా పాలకవర్గం వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసనకు దిగారు. మూడేళ్ల క్రితం ట్యాంక్ నిర్మించారని, ప్రతి ఇంటికీ పైప్‌లైన్‌లు వేశారని, కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారని విమర్శించారు. ఉన్న ఒక్క చేతిపంపు వద్ద గంటల తరబడాల్సి వస్తోందని తెలిపారు. పొద్దంతా కూలీపనులకు వెళ్లివచ్చి నీటిని మోసుకు రావడం సమస్యగా మారిందని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

సీఎంఓ కార్యదర్శి చొరవతో..

బామ్లానాయక్ తండా పరిధిలోని భూక్యతండాలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు అందించేందుకు 20వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ను నిర్మించారు. చివరి ఇళ్లకు నీరు సరఫరా కాలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీఎంఓ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ సర్పంచ్ బదావత్ రాజునాయక్‌కు ఫోన్‌చేసి సమస్య తెలుసుకున్నారు. 2020లో 30వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణానికి రూ.16లక్షలు విడుదల చేశారు. ఈ నీటితో భూక్యా తండా, ఇస్లావత్‌తండా వాడల్లోని దాదాపు 150 కుటుంబాలకు తాగునీటిని అందించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. 2021లో ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసిన అధికారులు.. ఇంటింటికీ పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు కూడా ఇచ్చారు. రెండేళ్లు గడుస్తున్నా ట్యాంక్‌కు మాత్రం కనెక్షన్ ఇవ్వడం లేదు. దీంతో గ్రామస్తులు నీటికోసం బోర్‌వెల్‌పైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో చేతిపంపులో కూడా నీరు సరిగ్గా రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంక్ ఎక్కి పాలకవర్గం నిరసన

మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సర్పంచ్ బదావత్ రాజునాయక్, వార్డుసభ్యులు ఆదివారం వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్ సర్పంచ్ రాజుతో ఫోన్లో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పినా.. రెండేళ్లుగా ఇలాగే చెబుతున్నారని, ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ దిగబోమని భీష్మించుకూర్చున్నారు. ఎస్ఈ అమరేంద్ర సర్పంచ్‌తో ఫోన్లో మాట్లాడి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేసమయంలో అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ సైతం ఎస్ఈతో ఫోన్లో మాట్లాడారు. పదిరోజుల్లోగా పనులు పూర్తిచేయకుంటే పార్టీ తరఫున ఆందోళన చేపడుతామని తెలిపారు. సర్పంచ్, వార్డుసభ్యులు ట్యాంక్ దిగారు.

నేడు విద్యుత్ విజయోత్సవ వేడుకలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాకేంద్రంలోని నందనగార్డెన్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, రామగుండంలోని లక్ష్మీనర్సింహాగార్డెన్‌లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కలెక్టర్ సంగీత, మంథని నియోజకవర్గంలో సెంటినరీకాలనీలోని రాణిరుద్రమదేవి గ్రౌండ్స్‌లో జరిగే సింగరేణి ఉత్సవాలకు మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు, ఎంపీ వెంకటేశ్‌నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు.

‘గుర్తింపు’ లేని కాంట్రాక్టు కార్మికులు

- సంస్థ వ్యాప్తంగా 25వేల మంది
- ఈనెల 13న ఆర్ఎల్‌సీ వద్ద సమావేశం
- తమకూ అవకాశం కల్పించాలని కాంట్రాక్టు కార్మికుల డిమాండ్



సింగరేణి కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక.. శ్రమకు తగిన వేతనం రాక ఇబ్బంది పడుతున్నారు సింగరేణి కాంట్రాక్టు కార్మికులు. కోలిండియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేస్తున్నా.. సింగరేణిలో మాత్రం అడిగేవారు లేకుండాపోయారు. దీంతో యాజమాన్యం ఇష్టారాజ్యంగా మారింది. తమను పట్టించుకునే యూనియన్ కోసం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ కాంట్రాక్టు కార్మికుల్లో వినిపిస్తోంది. సంస్థ విస్తరించి ఉన్న ఆరు జిల్లాలో సుమారు 25వేలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. భూగర్భగనుల్లో మొదలుకుని సివిక్, సివిల్, బెల్ట్ క్లీనింగ్, ఓబీ, తోటమాలి, ఆసుపత్రులు, వివిధ విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల పని కీలకంగా మారింది. గతంలో కన్నా కాంట్రాక్టు కార్మికుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. సంస్థవ్యాప్తంగా పర్మినెంట్ ఉద్యోగులు 42వేల మంది ఉండగా.. కాంట్రాక్టు కార్మికులు 25వేలకుపైగా పనిచేస్తున్నారు. వీరికి సమస్యలు తలెత్తితే యాజమాన్యంతో మాట్లాడే కార్మిక సంఘాలు కరువయ్యాయన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు వేతనాలు, కనీస సౌకర్యాలలోనూ అన్యాయం జరుగుతోందంటున్నారు.

సమస్యలు చెప్పుకోలేక..

కాంట్రాక్టు కార్మికుల విషయంలో యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందని వాపోతున్నారు. పర్మినెంట్ కార్మికులకు సమస్య వస్తే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు రంగంలోకి దిగి యాజమాన్యంతో చర్చిస్తాయి. చట్టబద్ధంగా హక్కులు సాధించుకుంటున్నాయి. అదే కాంట్రాక్టు కార్మికులకు సమస్య వస్తే యాజమాన్యంతో చర్చించే వారు లేకుండాపోయారు. ఈ క్రమంలో కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో మాదిరిగా ఎన్నికల్లో తమకు కూడా ఓటు హక్కు కల్పించాలని, లేని పక్షంలో ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈనెల 13న సమావేశం

సింగరేణి గుర్తింపు ఎన్నికలపై కీలక సమావేశం జరగనుంది. ఈనెల 13న హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సీ వద్ద గుర్తింపు ఎన్నికలపై కార్మిక సంఘాలతో యాజమాన్యం, ఆర్ఎల్‌సీ సమావేశం కానుంది. ఓటు హక్కు, కటాఫ్ తేదీ, గుర్తుల కేటాయింపులు, పోటీలో ఉండే యూనియన్ల అంశాలపై చర్చించనున్నారు. ఇందులో కాంట్రాక్టు కార్మికుల ఎన్నికలపైనా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన



మేళాకు హాజరైన నిరుద్యోగులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ట్రినిటి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో 136 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యావంతులు 2,600 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 560మందికి ఆఫర్ లెటర్స్ అందించినట్లు అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మరో 200 మందికి సెకండ్ ఇంటర్వ్యూ హైదరాబాద్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, భిక్షపతి, మనోజ్, తబ్రేజ్, ప్రిన్సిపల్ మణిగణేశ్, రమేశ్, రఫీక్, మధు తదితరులున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ

- శాంతిభద్రతలను కట్టడి చేయడంలో భేష్
- అందుబాటులో ఆధునిక వాహనాలు
- రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో వక్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంగీత, జెడ్పీచైర్మన్ మధు, ఎమ్మెల్యే దాసరి, ఏజేసీ, డీసీపీ, తదితరులు





ఆయుధాలను పరిశీలిస్తున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, పోలీసు వాహనాల ర్యాలీ

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రభుత్వం అధికారంలో కొచ్చాక పోలీసుశాఖలో అనేక సంస్కరణలు చోటు చేసుకున్నాయని, ఫ్రెండ్లీపోలీసింగ్ విధానంతో ముందుకు సాగుతున్నామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సురక్ష దివస్ నిర్వహించారు. కలెక్టర్ సంగీత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, డీసీపీ వైభవ్ గైక్వాడ్‌తో కలిసి వాహన ర్యాలీని ప్రారంభించారు. సీఎం కేసీఆర్ పోలీసుశాఖలో తెచ్చిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ప్రజలకు పోలీసుశాఖ అందిస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. అందరి అంచనాలను తారుమారు చేస్తూ పోలీసు శాఖ అన్నిరంగాల్లో అద్భుతాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.

ఠాణాల్లో ఓపెన్‌హౌజ్

పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ ఏర్పాటు చేశారు. పుట్ట మధు, దాసరి, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి తదితరులు ఆయుధాలు, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, ఫింగర్‌ప్రింట్, సైబర్‌క్రైం, షీటీం, కమ్యూనికేషన్, ట్రాఫిక్‌పోలీసు స్టాళ్లను పరిశీలించారు. ఆయుధాల పనితీరును డీసీపీ వివరించారు. జిల్లా పరిధిలో 4,310 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గోదావరినది ప్రాంతంలో రివర్‌పోలీసులు 166 మంది మహిళలు, 137మంది పురుషులు, 22మంది పిల్లలను కాపాడారని పేర్కొన్నారు.

అలరించిన ఓపెన్ హౌజ్

మంథని: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంథని సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్ అలరించింది. ఆయుధాల పనితీరును ప్రజలు, ప్రజాప్రతినిధులకు సీఐ సతీశ్ వివరించారు. కమిషరేట్ పరిధిలో పోలీసులకు 167 ఫోర్ వీలర్స్, 386 టూ వీలర్స్, 267 పెట్రోలింగ్ వాహనాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. ఎస్సైలు, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత ఉన్నారు.

గోదావరిఖని వన్‌టౌన్‌లో..

గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్‌లో నిర్వహించిన ఓపెన్‌హౌజ్ ఆకట్టుకుంది. చిన్నారులు, నాయకులకు పోలీసు పనితీరు, ఆయుధాల పనితీరును వివరించారు. ఎమ్మెల్యే చందర్ హాజరై మాట్లాడారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఉద్యోగాల కుంభకోణం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో ఉద్యోగాల కుంభకోణం కొనసాగుతోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ ఆరోపించారు. ఆదివారం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ప్లాంట్‌లో ఉద్యోగాల అమ్మకం పేరిట కాంట్రాక్టర్లు ఇష్టారీతిలో డబ్బులు దండుకుంటున్నారని, ఫలితంగా సంస్థ మరో ఆర్ఎఫ్‌సీఎల్ మాదిరిగా మారనుందని తెలిపారు. కొంతమంది రాజకీయ నేతలు, కాంట్రాక్టర్లు కలిసి రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వసూళ్ల దందాను నిలిపివేయాలని, లేకుంటే వారి ఇళ్లముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నిజమైన నిరుద్యోగులు, స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని అన్నారు. నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, కల్వల రాయమల్లు, రాజయ్య, శంకర్, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



మృతి చెందిన రేణుక

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: పట్టానికి చెందిన బోట్టుపెల్లి రేణుక(45) మహిళ అనారోగ్యంతో పట్టణంలోని పెద్దచెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం, రేణుక భర్త గతేడాది మృతిచెందడటంతో కూలి పనిచేసుకుంటూ జీవిస్తోంది. భర్త చనిపోయినప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తోంది. ఈక్రమంలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయన నేత్రాలు సజీవం



రాయమల్లు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 లో మజ్దూరుగా పనిచేస్తున్న బొడ్డు రాయమల్లు (51) సింగరేణి కార్మికుడు ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి త్రివేది అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్త డివిజన్ బూత్ ఇన్‌చార్జీ ఇల్లందుల శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం అల్లూరు చెరువులో పడి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ మక్కాన్ సింగ్ రాజ్‌ఠాగూర్ ఆదివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, రాజు, ముస్తఫా, శంకర్, తిరుపతిరెడ్డి, రాకేశ్, నరేశ్, శ్రీనివాస్, అరుణ్ తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన కార్మికుడు సారయ్య

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనపూర్ శివారులోని జల్లారం సాపైటీ తాళ్లలో బొల్లంపెల్లి సారయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటి చెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందనపూర్ దుబ్బపల్లికి చెందిన సారయ్యగౌడ్ రోజు లాగే ఉదయం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశత్తు చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో సారయ్య గౌడ్‌కు తీవ్ర గాయాలు కాగా తోటి కార్మికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ రాకపోవడంతో ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలుష్య కోరల్లో పారిశ్రామిక ప్రాంతం



లక్ష్మీపూరం డంప్‌యార్డులో కాలుతున్న చెత్త



గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ నమూనా చిత్రం

- పెరిగిపోతున్న జల, వాతావరణ కాలుష్యం
- వాతావరణ మార్పులతో భవిష్యత్తుపై ప్రభావం
- త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభం!
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: పర్యావరణం ప్రమాదపుటంచుల్లో ఉంది. ప్రకృతి సంపదైన నేల, నీరు, గాలి కలుషితమవుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. గుట్టలు, కొండలు కరిగిపోతుండగా, ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతోంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎఫ్‌సీఐ కర్మాగారం, సింగరేణి, ఎన్టీపీసీ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయుకాలుష్యంతో పారిశ్రామిక ప్రాంతం కాలుష్యపు కోరల్లో చిక్కుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను సింగరేణి, ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఎఫ్‌టీపీపీ (స్లామ్ ట్రీట్మెంట్ ప్లాంట్) ద్వారా శుద్ధిచేయకుండా గోదావరిలో కలిపేస్తుండడంతో నీరు కలుషితమైపోతోంది. కాలుష్య ప్రభావంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదుతో పాటు స్థానికంగా నివసించే ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పర్యావరణంపై ప్రచారం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్ పరిశ్రమల ద్వారా కాలుష్యాన్ని వెదజల్లడం.. అడవులను నరకడం.. నీరు కలుషితంగా మారడం పర్యావరణానికి ముప్పు తెచ్చిపెడుతోంది. దీని ప్రభావంతో రానున్న పదేళ్లలో జిల్లాలో పరిస్థితులు మరింత భయంకరంగా ఉండబోతున్నట్లు కేంద్ర పర్యావరణ పరిరక్షణ సంస్థ తేల్చిచెప్పింది.

ప్లాస్టిక్ వినియోగం యధాతథం..

పర్యావరణానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేయాలని ఎన్ని కార్యక్రమాలు చేపడుతున్నా ప్లాస్టిక్‌ను నిర్మూలించడంలో విఫలమవుతూనే ఉన్నాం. 40 మైక్రాన్‌ల మందం కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించినా, ఇంకా వాటి వాడకం కొనసాగుతూనే ఉంది. అధికారులు ఎప్పుడు తనిఖీలు చేసినా గుట్టలకొద్ది కవర్లు దొరుకుతూనే ఉన్నాయి. ప్రచారం కోసం రాజకీయ నాయకుల నుంచి పారిశ్రామిక, వ్యాపారవేత్తలు విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. పండగలు, సభలు, ఓపెన్‌వింగ్‌లు, అడ్మిషన్ల సమయాల్లో పెద్దఎత్తున ఫ్లెక్సీలు వినియోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ కవర్లను నిషేధించిన అధికారికంగా నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి సైతం ప్లాస్టిక్ ఫ్లెక్సీలను వినియోగించడం గమనార్హం.

రామగుండంలో త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యాన్ని నివారించేందుకు కేంద్ర, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంయుక్త భాగస్వామ్యంతో రామగుండం ప్రాంతంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును ప్రారంభించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ ఉన్నత అధికారులతో సమావేశం నిర్వహించారు. మరో ఆరు నెలలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

నివారణకు ఇలా చేద్దాం..

- ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పేపర్, జూట్ బ్యాగుల వాడకం పెంచాలి.
- పరిశ్రమల ద్వారా వచ్చే వ్యవర్థాలను నీటిలో కలవకుండా చూడాలి.
- రసాయనిక ఎరువుల వాడకాన్ని నిర్మూలించాలి.
- అడవులను నరకకుండా మొక్కలను విరివిగా పెంచాలి.
- వాయు కాలుష్యాన్ని నివారించాలి.
- వర్షపు నీటిని ఒడిసి పట్టేలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



తాజ్‌బాబా మృతదేహం

రామగుండం: పట్టణంలోని విద్యుత్‌నగర్‌కు చెందిన తాజ్‌బాబా(18) యువకుడు ఆదివారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. విద్యుత్‌నగర్‌లో నివాసముండే ఫెరోజ్ అనే ఆటోడ్రైవర్ కుమారుడు తాజ్‌బాబా సమీపంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి భారీగా వీచిన ఈదురుగాలులతో ఇంటిపైకప్పు రేకులు లేవకుండా బండరాళ్లు పెడుతుండగా పైనున్న విద్యుత్ తీగలను గుర్తించకపోవడంతో విద్యుత్ షాక్‌కు తగిలి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై రామగుండం ఏఎస్సై పులి సుదర్శన్‌ను వివరణ కోరగా మృతిచెందిన విషయం వాస్తవమేనని, వారి నుంచి ఏలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు.

ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మంథని: ముత్తారం మండలకేంద్రంలో ఆదివారం పెయ్యల చంద్రయ్య(62) తన ఇంటి వద్దనున్న చెట్టును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈక్రమంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించి..





మండలంలోని రామయ్యపల్లి శివారు చెరువు నుంచి కొందరు నిబంధనలను అతిక్రమించి మట్టిని తరలిస్తున్నారు. ఆ మట్టిని పెద్దపల్లి మండలం రాఘవాపూర్, గౌరెడ్డిపేటలోని ఇటుక బట్టీలకు చేరవేస్తున్నారు. ఇటుకబట్టీల యజమానులు ప్రభుత్వం నుంచి నామమాత్రపు అనుమతి తీసుకుని.. మట్టిని పగలు, రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. టిప్పర్లలో మట్టిని తరలించడం ద్వారా రోడ్లు ధ్వంసమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా వేబిల్లుకు మించి మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. – ధర్మారం

ఆర్జీ–1 ఏరియా ఉత్తమ కార్మికులు వీరే

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ–1 పరిధిలో పనిచేస్తున్న ఉత్తమ కార్మికుల పేర్లను యాజమాన్యం ఆదివారం ప్రకటించింది. జీడీకే–2, 2ఏ గనిలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు, జీడీకే–11 గనిలో షెటిల్ కార్ ఆపరేటర్ బి.మహేశ్, జీడీకే–1 సీఎస్‌పీ కన్వేయర్ ఆపరేటర్ ఎస్.ఉపేందర్‌ను ఎంపిక చేశారు. ఉత్తమ అధికారులుగా ఈఅండ్‌ఎం ఏజీఎం ఎస్.రామకృష్ణ, జీడీకే–5 ఓసీపీ మేనేజర్ అనిల్‌గభాలేను ప్రకటించారు. సోమవారం సింగరేణి స్టేడియంలో నిర్వహించే తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో ఘనంగా సన్మానించనున్నారు.

ఆర్జీ–2 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే

ఆర్జీ–2 ఏరియా ఉత్తమ ఉద్యోగుల పేర్లను యాజమాన్యం ప్రకటించింది. ఏరియా సెక్యూరిటీ డీజీఎంగా పనిచేసును పి.వెంకటరమణ, ఓసీపీ–3 డీవైఎస్ఈ ఎ.కృష్ణమూర్తి, ఏరియావర్క్‌షాప్ ఎలక్ట్రీషయన్ ఆరెల్లి సమ్మయ్య, వకీల్‌పల్లి గని ఫిట్టర్ ఎన్.జగదీశ్, ఓసీపీ–3 సీహెచ్‌పీ కన్వేయర్ ఆపరేటర్ రెడ్డి రాజయ్య పేర్లను ప్రకటించారు. వీరిని సోమవారం గోదావరిఖని సింగరేణి స్టేడియంలో సన్మానించనున్నారు. ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపికైన ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ కొత్త రమేశ్‌ను కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించే ప్రధాన వేడుకల్లో సంస్థ సీఅండ్‌ఎండీ సన్మానించనున్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మంథని: ముత్తారం మండలంలోని లక్కారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగి పలువురు రైతులకు చెందిన గడ్డివాములు, బోరు పైపులు దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసి పడడంతో అప్రమత్తమైన రైతులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో మంథనిలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం ఘటన స్థలానికి వెళ్లి మంటలు ఆర్పివేసింది. అప్పటికే రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.

నృత్యోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

జ్యోతినగర్: మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సౌజన్యంతో, ప్రేమ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవాలు 2023, అంతర్జాతీయ, జాతీయస్థాయి విశిష్ట పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం–2023కు మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ దరఖాస్తులకు ఆహ్వానించింది. భరత నాట్యం, కూచిపూడి, పేరిని, దేశభక్తి, జానపదం, సినిమా మొదలైన నృత్య, పాటల పోటీల విభాగాల్లో ప్రతిభకనబరుస్తూ, వినూత్న కార్యక్రమలు చేస్తున్న కళాకారుల, సంగీత విధ్వాంసుల ప్రతిభను గుర్తించి వారి కళా నైపుణ్యంతో వరల్డ్ రికార్డ్‌లో పేర్లు నమోదు చేసుకుని అంతర్జాతీయ, జాతీయ స్థాయి పురస్కారాలతో పాటు వరల్డ్ రికార్డ్స్ ప్రశంశ పత్రాలను ప్రముఖుల చేతుల మీదుగా అందించనున్నట్లు ప్రతినిధులు పి.సురేశ్ బాబు, సుధారాణి, పి.అరుణకుమారి, దాసరి స్వప్న మహేశ్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 23 సాయంత్రంలోగా మదర్ ఇండియా వరల్డ్ రికార్డ్స్ జ్యూరీ కమిటీకి వివరాలు పంపించాల్సిందిగా కోరారు మరిన్ని వివరాలకు సంస్థ జ్యూరీ కమిటీ ఫోన్‌నంబర్ 9704510758, 9704652590లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో స్నేహితులు మృతి

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్
- రెండు గ్రామాల్లో విషాదం



కృపానంద్ (ఫైల్)



గంగాధర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: నలుగురు స్నేహితులు సరదాగా కలిశారు.. మా టల్లో దిగారు.. ఆదివారం వేకువజామున రెండు బైక్‌లపై ఇళ్లకు బయలుదేరారు. ఈక్రమంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహంకాళి నర్సయ్య– కళావతి కుమారుడు కృపానంద్(22), మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన బడుగు మొండయ్య– సుజాత కొడుకు గంగాధర్(19) స్నేహితులు. వీరితో పాటు మరో ఇద్దరు స్నేహితులు శనివారం రాత్రి జగిత్యాలలో కలుసుకున్నారు. లింగంపేట శివారుకు వెళ్లారు. ఆదివారం ఉదయం 3గంటల సమయంలో ఇళ్లకు బయలుదేరారు. కృపానంద్, గంగాధర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొత్తబస్టాండు ఔట్ గేట్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. పట్టణ ఎస్సై వేణురావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగాధర్ తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

రెండు గ్రామాల్లో విషాదం

నిత్యం కలిసిమెలిసి ఉండే ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో లక్ష్మీపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

వెల్గటూర్ : ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఠాకూర్ సాయితేజ సింగ్ (21) శనివారం రాత్రి స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై శెకల్ల నుంచి జగిత్యాలకు వెళ్తుండగా గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట శివారు మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో సాయి తేజ్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతుడి బాబాయ్ ఠాకూర్ సుధీర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తుడి హఠాన్మరణం

కొండగట్టు(చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంపై హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన ఆజె కిష్టయ్య (70) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కిష్టయ్య ఆదివారం స్వామివారి దర్శనానికి వెళ్తుండగా కొండపై ఉన్న పాద రక్షల స్టాండ్ వద్ద కుప్పకూలి మృతిచెందినట్లు ఏఎస్ఐ రమణరెడ్డి తెలిపారు. అర్చకులు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ అనంతరం తిరిగి ప్రారంభించారు.

మంథని కాంగ్రెస్‌లో ముసలం

- ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య విబేధాలు
- క్యాంపు కార్యాలయంలోనే దాడికి పాల్పడిన వైనం
- సోషల్ మీడియా ఇన్‌చార్జి తొలగింపు



మంథని: మంథని కాంగ్రెస్‌లో ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య వార్ కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం ఏకంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే ఓ నాయకుడిపై దాడి జరగడం వారి మధ్య విబేధాలను బట్టబయలు చేసింది. ఈ విషయంపై అధిష్టానం క్రమశిక్షణ చర్యలు చేపట్టి దాడికి పాల్పడిన వ్యక్తిని తొలగించింది.

వసూళ్లపై వార్..?

గతేడాది ఓ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడి నుంచి కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు కొంత మొత్తం వసూలు చేసిన విషయాన్ని ఓ నాయకుడు సోషల్ మీడియాలో పోస్ట్‌చేయడంతో విభేదాలు తలెత్తాయి. ధాన్యం కొనుగోలులో వసూళ్లపై రైతు నాయకుడు బాధితుడిని కీలక నాయకుడి వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం. నిర్వాహకుడి వద్ద సోషల్ మీడియా పేరిట కలెక్షన్లు..? అంటూ ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో విషయం తెల్సిన సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జి సదరు నాయకుడిపై క్యాంపు కార్యాలయంలో దాడికి పాల్పడినట్లు సమాచారం.

ప్రతిపక్షాల మౌనం..?

మంథని నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఏ చిన్న ఘటన జరిగినా అది తమకు అనుకూలం లేదా.. వ్యతిరేకమైతే పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం సహజంగా ఉండేది. పార్టీపరంగానే కాకుండా వ్యక్తిగతంగా సైతం ఎన్నోసార్లు కార్యకర్త నుంచి మొదలు నియోజకవర్గస్థాయి నాయకుడి వరకు ఆరోపణలు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. కొందరు నాయకులైతే సోషల్ మీడియా ప్రధాన వేదికగా చేసుకుని ప్రచారం చేపట్టారు. ఓ పార్టీ నాయకుడు చేసిన చిన్నతప్పును సైతం బూతద్దంలో పెట్టి మరీ వైరల్ చేయడం మంథనిలో ఆనవాయితీగా మారింది. ప్రజలకు ఏ మాత్రం పనికిరాని విషయాలను కొందరు నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం అలవాటైంది. మూడు రోజుల క్రితం ఓ పార్టీ నాయకుడిపై అదే పార్టీకి చెందిన వ్యక్తి దాడికి పాల్పడినప్పటికీ ఈ విషయంపై ప్రత్యర్థి పార్టీ నుంచి సోషల్ మీడియాలో ఎలాంటి స్పందన లేకపోవడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

సోషల్ మీడియా ఇన్‌చార్జి తొలగింపు

మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గొడవపై మంథని కాంగ్రెస్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ఇందారపు అనిల్‌ను తొలగించినట్లు రాష్ట్రపార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ నవీన్‌పెట్టెం ఆదేశాలు జారీ చేశారు.

ముదురుతున్న వర్గ పోరు

మంథని నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరింది. అప్పడప్పుడు నాయకుల మధ్య జరిగిన గొడవలు వారి విభేదాలను బయటపెడుతున్నాయి. గతంలో ఇద్దరు నాయకుల మధ్య జరిగిన గొడవ ఓ నాయకుడు పార్టీ నుంచి వెళ్లేవరకూ వచ్చింది. ఈ క్రమంలో చాలామంది కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. తమ అదినాయకుడు అధికారంలో ఉన్న సమయంలో సైతం ద్వితీయ శ్రేణి నాయకుల ప్రవర్తనతో ఓటమి పాలైనట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో క్యాడర్ మధ్య పొడచూపుతున్న విభేదాలు ఎక్కడికి దారితీస్తాయోననే చర్చ సాగుతోంది.

గ్రామాన్ని కప్పేస్తున్న బూడిద



రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన కుందనపల్లిలో ఆదివారం రాత్రి భారీ ఈదురుగాలులకు యాష్‌పాండ్ నుంచి బూడిద గాలిలో కలిసి గ్రామాన్ని కప్పేసింది. దీంతో ఇంట్లోని వంటపాత్రలు, బెడ్‌రూం, డైనింగ్ హాల్స్,వాహనాలు బూడిదమయంగా మారాయి. గతంలో ఎన్టీపీసీ అధికారులు బూడిద చెరువులో గాలికి బూడిద లేవకుండా నీటితో స్ప్రింక్లింగ్ చేసి అరికట్టేలా చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలకు స్వస్తి పలకడంతో ఎన్టీపీసీ యాజమాన్యం ప్రభావిత గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి లాభార్జనే ధ్యేయంగా బూడిద తరలింపునకు అనుమతులపై దృష్టిసారిస్తూ నిర్వాసిత గ్రామాల సంక్షేమాన్ని విస్మరిస్తోందని గ్రామస్తులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్టీపీసీ బూడిద చెరువు రామగుండం రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలో ఉండడంతో ఈదురుగాలులతో రైల్వేట్రాక్ తో పాటు సిగ్నల్స్ కనిపించకుండా పోతున్నాయి. దీనిపై సంబంధిత ఎన్టీపీసీ అధికారులు మానవతా దృక్పధంతో నిర్వాసిత గ్రామాల సంక్షేమాన్ని పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.